నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 7 ఏప్రిల్ 2024 | RANGAREDDY



## రైతుదీక్షలో పవర్ కట్..!

### అధికారులకు ఫోన్ చేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రైతుదీక్షలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి మైక్‌లో మాట్లాడుదామ కున్న సమయంలో కరెంట్ పోయింది. దీంతో ఆమె విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కరెంట్ కట్ చేయొద్దని చెప్పారు కాదా అడిగారు. విద్యుత్తు సరఫరా సక్రమంగా జరుగడంలేదని ప్రజలు చెబుతుంటే మీరేమో ట్రిప్ అయిందని అబద్ధాలు చెబుతున్నారన్నారు. అయితే దీనిపై సైబర్‌సిటీ ఎస్ఈ ఓ ప్రకటనలో వివరణ ఇస్తూ ఆ దీక్షకు అక్రమంగా విద్యుత్తును వినియోగించారని.. ఆ సమయంలో కరెంట్ కోతనే లేదని తెలిపారు.

- రైతుల పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదు
- చేవెళ్లలో నిర్వహించిన రైతు ధర్నాలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య
- రైతు దీక్షలు, ధర్నాలతో దద్దరిల్లిన రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు



రైతు ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువే..

షాబాద్, ఏప్రిల్ 6 : రాష్ట్రంలో రైతులకు వచ్చిన కరువు కాలం తెచ్చింది కాదని..కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం చేవెళ్లలోని శంకర్‌పల్లి ఎక్స్ రోడ్డులో ఉన్న ఇంద్రారెడ్డి చౌరస్తాలో జరిగిన రైతు ధర్నాలో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అనుక్షణం రైతుల గురించే ఆలోచించారని.. వారిని కంటికి రెప్పలాగా కాపాడారన్నారు. అన్నదాతలు తమ పంటలను సాఫీగా సాగుచేసుకునేందుకు 24 గంటలపాటు కరెంట్‌ను ఉచితంగా పంపిణీ చేశారన్నారు. అంతేకాకుండా పంటల సాగుకు అన్నదాతలు వడ్డీవ్యాపారులు, ఇతరుల వద్ద అప్పులు తీసుకొచ్చి తిప్పలు పడొద్దనే సదుద్దేశంతో వాన చినుకులు పడిన వెంటనే రైతుబంధు డబ్బులను రైతన్నల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారని గుర్తు చేశారు. రైతు చనిపోతే దినవారం కూడా కాకముందే రూ.5లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఆరుగాలం కష్టించి పని చేసే అన్నదాతకు అండగా ఉండేందుకు.. పండించిన పంటకు మద్దతు ధరను చెల్లించి కొనేందుకు గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. నీటి వనరుల కోసం కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అతి తక్కువ సమయంలోనే పూర్తి కాగా.. అక్కడ రెండు పిల్లర్లు దెబ్బతింటే మొత్తం ప్రాజెక్టే కూలిపోయిందని అధికార పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారంపై ఆమె మండిపడ్డారు. నీళ్లుండి..వాడుకునే అవకాశం ఉన్నా.. సరఫరా చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోయి అన్నదాతలు ఇబ్బందిపడుతుంటే పాలకులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మొన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నల్గొండ పర్యటనకెళ్తే.. తెల్లారే నీళ్లు వచ్చాయని.. అంటే ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నాయి కాబట్టే విడుదల చేశారన్నారు. దీనిని బట్టి చూస్తే.. ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తీసుకొచ్చిన కరువేనని మనకు స్పష్టంగా తెలుస్తున్నదన్నారు. కేసీఆర్ ఎర్రటి ఎండలో పొలాల్లో తిరుగుతూ.. రైతులతో మాట్లాడి భరోసా కల్పిస్తున్నారని.. ప్రభుత్వం దిగొచ్చి అన్నదాతకు న్యాయం చేసేవరకు కొట్లాడుతానని అభయం ఇచ్చారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 110 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని మండిపడ్డారు. వరిపంటకు బోనస్ ఇవ్వకుండా, ఎండిపోయిన పంటలకు పరిహారం ప్రకటించకుండా రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రైతులంతా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.


### కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం: కాలె యాదయ్య చేవెళ్ల ఎమ్మెల్యే

కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని.. బీఆర్ఎస్ అధినేతను బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మండిపడ్డారు. పంటలు ఎండినా.. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్న పట్టించుకోవడంలేదన్నారు. సాగునీటిని అన్నదాతలకు అందించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదన్నారు. బీఆర్ఎస్‌పై బురద జల్లడం మానుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పాలకులకు సూచించారు. ఈ దీక్షలు ఆరంభం మాత్రమేనని.. మళ్లీ ఉద్యమబాట పడితే ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా కాంగ్రెస్‌ను వెంటాడుతూనే ఉంటామని హెచ్చరించారు. 14 ఏండ్లు పోరాడి ప్రత్యేక రాష్ర్టాన్ని సాధించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఆయన పదేండ్ల కాలంలో రాష్ర్టాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను అందించారు. అన్నదాతలకు ఉచితంగా 24 గంటలపాటు విద్యుత్తును సరఫరా చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎనాడూ కరెంట్ పోలేదు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో రోజుకు నాలుగైదుసార్లు కరెంట్‌ను కట్ చేస్తున్నారు. రైతన్నలు ఆలోచించి రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి. కార్యక్రమంలో జడ్పీటీసీలు పట్నం అవినాశ్‌రెడ్డి, కాలె శ్రీకాంత్, ఎంపీపీలు గోవర్ధన్‌రెడ్డి, గునుగుర్తి నక్షత్ర, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, అనంతరెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు ప్రభాకర్, నర్సింగ్‌రావు, నాగిరెడ్డి, గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు వెంకటరంగారెడ్డి, డాక్టర్ ప్రశాంత్‌గౌడ్, నర్సింగ్‌రావు, పాపారావు, యాదగిరి, జయంత్, శేఖర్, పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


## కాంగ్రెస్ పాలనలో రైతులకు అష్టకష్టాలు..

*-బీఆర్ఎస్ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి*

కొడంగల్ : సీఎం కేసీఆర్ హయాంలో రైతులు ఏ లోటు లేకుండా వ్యవసాయాన్ని పండుగలా చేసుకుంటూ దర్జాగా బతికితే.. నేడు కాంగ్రెస్ సర్కార్ పాలనలో సాగునీటి కొరత, కరెంటు కోతలతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యవైఖరికి వ్యతిరేకంగా స్థానిక అంబేద్కర్ కూడలిలో శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పటివరకు కనీసం ఆరు గ్యారెంటీలను సైతం పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీనీ అమలుచేసే వరకూ ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సోనియా పుట్టినరోజున రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. కొడంగల్‌లో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేసి ఇక్కడున్న పచ్చటి వాతావరణాన్ని కాలుష్యంతో నాశనం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. కొడంగల్ ప్రజల రుణాన్ని తీర్చుకోవాలంటే ఐటీ, టెక్స్‌టైల్, టెస్లా కార్ల వంటి కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరిచి ఎండిన పంటలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. వరి ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల మాటలకు మోసపోయినట్లు.. పార్లమెంటు ఎన్నికల్లో మోసపోకూడదని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు



దీక్షలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్, నాయకులు, రైతులు

## కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం

*-బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్*

వికారాబాద్ : కాంగ్రెస్ సర్కారు రైతు వ్యతిరేక ప్రభుత్వమని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు ఇవ్వకపోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయన్నారు. ఇది చాలదన్నట్లు రైతుబంధు, రుణమాఫీ, వరి ధాన్యానికి రూ.500 బోనస్ వంటి హామీలను అమలు చేయకుండా రైతులను మరింత ఆర్థిక కష్టాల్లోకి నెడుతున్నదన్నారు. ఎండిన పంటలకు కనీసం నష్టపరిహారం ఇచ్చే స్పృహ కూడా కాంగ్రెస్ సర్కార్‌కు లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మండుటెండల్లో ప్రజలకు కనీసం తాగునీరిచ్చే సోయి కూడా పాలకులకు లేదన్నారు. మిషన్ భగీరథ నీటిని సద్వినియోగం చేసుకోలేని స్థితిలో కాంగ్రెస్ దద్దమ్మలు ఉన్నారన్నారని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికలకు ముందే అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెసోళ్లు.. ఇప్పుడు కోడ్‌ను సాకుగా చూపుతూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఈ దీక్షలు ఆరంభం మాత్రమేనని.. ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వెంటాడుతూనే ఉంటామని హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, టీఎస్ఈడబ్ల్యూ ఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, అనంత్‌రెడ్డి, విజయ్‌కుమార్, గోపాల్, రామస్వామి, వేణుగోపాల్‌రెడ్డి, రమేశ్, గిరీశ్, సుభాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

### నిరసన దీక్షలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కూడా కాలేదు అప్పుడే రాష్ట్రంలో కరువుఛాయలు కనిపిస్తున్నాయని.. గతంలో పచ్చదనాన్ని తలపించిన పంట పొలాలు నేడు నీళ్లు లేక ఎడారిగా మారుతున్నాయని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు షాద్‌నగర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం రైతు నిరసన దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ తక్షణమే రైతులను ఆదుకోవాలన్నారు. పంటలకు నీళ్లు ఇవ్వడంతోపాటు ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, కేశంపేట ఎంపీపీ వై. రవీందర్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, కౌన్సిలర్లు ప్రతాప్‌రెడ్డి, నందీశ్వర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, నాయకులు లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాస్, చందూనాయక్, ప్రమోద్, ఆఫీజ్, యాదగిరి, సత్యనారాయణ, రాజలక్ష్మి, విజయలక్ష్మి, వెంకట్‌రెడ్డి, యుగేందర్, శంకర్, చంద్రశేఖర్, పాండు రంగారెడ్డి, హన్యానాయక్, రామకృష్ణ, ఏజాజ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్

## ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చేంత వరకూ పోరాడుతాం

*-పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి*

పరిగి : ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చేంత వరకూ రైతుల పక్షాన పోరాడుతామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక సర్కారుఅని.. వ్యవసాయాన్ని నాశనం చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వా లని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం పరిగిలో నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొన్న మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఏ ఒక్క హామీనీ సరిగ్గా అమలు చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో అన్నదాతలు తమ పంటలను ఏ ఇబ్బంది లేకుండా సంతోషంగా సాగు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. వంద రోజులు దాటినా ఐదు ఎకరాల వారికి కూడా రైతుబంధు డబ్బులు రాలేదన్నారు. కరెంటు కోతలు అప్పుడే మొదలయ్యాయని..రుణమాఫీ ఊసే లేదని ఆరోపించారు. వరి పంటకు మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని..లేకపోతే రైతుల తరపున బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దోమ జడ్పీటీసీ కొప్పుల నాగారెడ్డి, పరిగి, పూడూరు ఎంపీపీలు కరణం అరవిందరావు, మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, మండలాల పార్టీ అధ్యక్షులు ఆర్.ఆంజనేయులు, సత్తినేని సుధాకర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేడిద రాజేందర్, బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీరంపల్లి రాజు, ఎస్.భాస్కర్, పి.వెంకటయ్య, నల్క జగన్, వెంకటయ్య, రాజేందర్‌రెడ్డి, పి.రా మన్నమాదిగ, బి.రవికుమార్, కౌన్సిలర్లు నాగేశ్వర్, వారాల రవీంద్ర, ఎదిరె కృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

**యథేచ్ఛగా లభ్యమవుతున్న గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు**

# మత్తుకు యువత చిత్తు..

**యువత, విద్యార్థులే లక్ష్యంగా గంజాయి ముఠాల విక్రయం**

**బానిసలుగా మారుతూ.. జీవితాన్ని అంధకారంగా మార్చుకుంటున్న స్టూడెంట్స్**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 6 : శివారు ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలు రాజ్యమేలుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయి. దీంతో శివారు ప్రాంతాలు, రంగారెడ్డి జిల్లాలోని యువత, విద్యార్థులు వాటిని తీసుకుంటూ మత్తుకు చిత్తవుతూ తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇటీవల తుర్కయాంజాల్‌లో ఓ యువకుడు మత్తుకు బానిసై జన్మనిచ్చిన తండ్రి పైనే పెట్రోల్ పోసి దారుణంగా చంపేశాడు. ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, ఘట్‌కేసర్ వంటి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఫామ్‌హౌస్‌లు వెలిశాయి. అక్కడ రాత్రివేళల్లో పుట్టినరోజు వేడుకలు, ఇతర ఫంక్షన్లు జరుగుతుంటాయి. వాటిలో డ్రగ్స్, గంజాయి, హుక్కా వంటి వాటిని వాడుతున్నట్లు సమాచారం. అలాగే, శివారు ప్రాంతాలు ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతున్నాయి. ఇబ్రహీంపట్నం, మొయినాబాద్, ఘట్‌కేసర్ ఆదిబట్ల, మంగల్‌పల్లి, బొంగుళూరు, తుర్కయాంజాల్ తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఇంజినీరింగ్‌తోపాటు వివిధ కోర్సుల కళాశాలలు.. వందలాది ప్రైవేట్ హాస్టళ్లున్నాయి. పలు దేశాలకు చెందిన యువతీయువకులు వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. కళాశాలల విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని కొంతమంది పెద్ద ఎత్తున గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను విక్రయిస్తూ వారిని డ్రగ్స్‌కు బానిసలుగా మార్చుతున్నారనే ఆరోపణలున్నాయి.

### గంజాయి, డ్రగ్స్ కేసుల నమోదు..

ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల పెద్ద ఎత్తున గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కేసులు నమోదవుతున్నాయి. రెండుమూడు రోజులకోసారి గంజాయి అక్రమ నిల్వలను పోలీసులు పట్టుకుంటున్నారు. ఇటీవల ఓఆర్ఆర్ మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న గంజాయిని హయత్‌నగర్, ఆదిబట్ల పోలీసులు పెద్ద ఎత్తున సీజ్‌చేశారు. తాజాగా గురువారం ఇబ్రహీంపట్నంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

### యువత, విద్యార్థులే లక్ష్యంగా..

గంజాయి మత్తులో యువత పక్కదారి పట్టడమే కాకుండా వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నది. యువత, విద్యార్థులే లక్ష్యంగా గంజాయి ముఠాలు రెచ్చిపోతున్నాయి. పుట్టిన రోజులు, ఇతర పార్టీలు చేసుకునే ఇంజినీరింగ్ విద్యార్థులకు నేరుగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను చేరవేస్తున్నారు. దీంతో వారు దానికి బానిసై తమ బంగారు భవిష్యత్తుతోపాటు తల్లిదండ్రుల ఆశలను కూడా నీరుగార్చుతున్నారు. డ్రగ్స్ మత్తులో ఇంట్లోని వారిని ఇబ్బందులకు గురి చేయడంతోపాటు ఘర్షణకు దిగుతున్నారు. ఇటీవల డ్రగ్స్ మత్తులో తుర్కయాంజాల్‌లో ఓ యువకుడు తండ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించి అతి కిరాతకంగా చంపేశాడు.

### మత్తు పదార్థాల విక్రయంపై ఉక్కుపాదం



ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించేందుకు ప్రత్యేక నిఘా టీంలను ఏర్పాటు చేశాం. ముఖ్యంగా కళాశాలలు, వసతిగృహాలు వంటి ప్రాంతాల్లో పోలీసులతో ప్రత్యేక నిఘా పెట్టాం. మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా చట్టరీత్యా నేరం. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

-పీవీఎస్ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ

# నిఘా.. నిరంతరం..

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం
- చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచిన చేస్తున్న అధికారులు
- ఇప్పటివరకు 72.20 లక్షల నగదు సీజ్
- 551 లీటర్ల మద్యం, 2.2 కిలోల గంజాయి స్వాధీనం

వికారాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. వికారాబాద్ జిల్లాకు ఆనుకొని ఉన్న కర్ణాటక రాష్ట్రం సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు అందుబాటులోకి తీసుకువచ్చి డబ్బు, మద్యం తరలించేవారిపై నిఘా ఉంచారు. అంతేకాకుండా వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలు, మండలాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. సీ–విజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 6 బృందాలు, 6 ఎస్ఎస్‌టీ బృందాలు 24 గంటలపాటు పర్యవేక్షణ చేపడుతున్నారు.

### పెద్ద ఎత్తున నగదు స్వాధీనం...

ఎన్నికల అధికారులు నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్లతోపాటు పోలీసులు నిత్యం తనిఖీలు చేస్తున్నారు. నాలుగు నియోజకవర్గాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద, అంతర్‌రాష్ట్ర సరిహద్దుల వద్ద తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలో 7 అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు, 8 అంతర్‌జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేల మించి నగదును తరలించినట్లయితే సంబంధిత డబ్బుకు సంబంధించి సరైన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలను అధికారులకు చూపించాల్సి ఉంటుంది. లేకపోతే ఆ నగదును జిల్లా ఎన్నికల అధికారులకు అప్పజెప్పుతారు. రూ.10 లక్షలకు మించి నగదు పట్టుబడినట్లయితే సంబంధిత నగదును ఐటీ శాఖకు జిల్లా ఎన్నికల అధికారులు అప్పజెప్పనున్నారు. అయితే జిల్లావ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.72.20 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 551 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. మరోవైపు 2.2 కిలోల గంజాయి, 46 గ్రాముల బంగారం, 2 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో 240 లైసెన్సుడ్ గన్లు ఉండగా, ఇప్పటికే 218 మంది డిపాజిట్ చేయడం జరిగింది. జిల్లావ్యాప్తంగా 262 మందిని బైండోవర్ చేశారు.

### సరిహద్దుల వద్ద 15 చెక్‌పోస్టులు...

జిల్లాలో 15 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ అధికారులతో చెక్‌పోస్టుల్లో బందోబస్తు నిర్వహిస్తున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 7 చెక్‌పోస్టులు, 8 అంతర్ జిల్లా సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. జిల్లాకు ఆనుకొని ఉన్న కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చంద్రకల్ వద్ద, కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కస్తూరుపల్లి వద్ద, బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైల్వార్, ఇందర్‌చెడ్, నవాంగి వద్ద, కరన్‌కోట్ పీఎస్ పరిధిలో కొత్లాపూర్ వద్ద, బంట్వారం పోలీస్ స్టేషన్ పరిధిలో బొపనారం వద్ద అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

